

బాధితులకు భరోసా

మేమున్నాం.. ధైర్యంగా ఉండండి

మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరామర్శ

- కేజీహెచ్‌లో మృతుల కుటుంబాలకు ఓదార్పు
- ఎసెన్షియా కంపెనీలో పర్యటించి ఘటనపై అధికారులతో సమీక్ష
- యాజమాన్యం తీరుపై ఆగ్రహం
- రెండు జిల్లాల్లో సుడిగాలి పర్యటన



మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఎం



క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

విపత్తు జరిగినప్పుడు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుంటారని మరోసారి రుజువు చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా కంపెనీలో భారీ ప్రమాదం సంభవించిన తరువాత అమరావతి నుంచి ఎప్పటికప్పుడు సమీక్షించిన చంద్రబాబు గురువారం ఉదయం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించారు. సంఘటనా స్థలం సందర్శన కంటే తొలుత బాధితులను పరామర్శించి వారిని ఓదార్చాలని భావించి ఉదయం నుంచి సాయంత్రం వరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సుడిగాలి పర్యటన చేశారు.

గురువారం ఉదయం విజయవాడ నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన విశాఖ వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మెడికవర్‌లో ఏడుగురు క్షతగాత్రులను వారు చికిత్స తీసుకుంటున్న బెడ్‌ల వద్దకు వెళ్లి జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నారు. పూర్తిగా నయం అయ్యేవరకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని, అందుకు ఖర్చు విషయంలో వెనుకాడేదిలేదని చెబుతూ పక్కనే ఉన్న వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అక్కడ నుంచి కోస్టల్ బ్యాటరీకి వెళ్లి హెలికాప్టర్‌లో అచ్యుతాపురం వెళ్లాలని షెడ్యూల్‌లో ఉంది. అయితే మెడికవర్ నుంచి కేజీహెచ్‌కు వెళ్లి మృతుల బంధువులతో మాట్లాడాలని నిర్ణయించి కలెక్టర్‌కు అదే విషయం తెలిపారు. దీంతో సీఎం కేజీహెచ్‌కి రోడ్డుమార్గాన బయలుదేరి వెళ్లారు. బుధవారం ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి భౌతికకాయాలకు పోస్టుమార్టం నిర్వహించే మార్చురీ వద్దకు వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని చెప్పి మృతుల కుటుంబాలకు రూ.కోటి వంతున పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. ఇంకా ప్రభుత్వ పరంగా సహాయం విషయంపై కూడా ఆలోచన చేస్తున్నామని వారికి చెప్పి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను చంద్రబాబు పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అక్కడ నుంచి తిరిగి కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం జరిగిన కర్మాగారాన్ని సందర్శించారు. తరువాత అదే ప్రాంతంలో ఉన్న లారస్ ల్యాబ్‌లో సెమినార్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాగార యాజమాన్యం తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వకంగా ఉంటూ మరిన్ని పెట్టుబడుల కోసం ప్రయత్నించే చంద్రబాబు ఎసెన్షియా కంపెనీ యాజమానుల మధ్య వివాదాన్ని ప్రస్తావించారు. అచ్యుతాపురం సెజ్‌లో అత్యంత తీవ్రమైన ప్రమాదం జరిగి 17 మంది చనిపోయి, 62 మంది గాయపడితే కర్మాగారం పెట్టిన ప్రమోటర్ ఘటనా స్థలానికి రావడం ప్రాథమిక బాధ్యత అని సీఎం ఒకింత తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావాలని కోరుకునే వ్యక్తిని... ఇంకా పారిశ్రామికవేత్తలను గౌరవిస్తాం... అని చెప్పారు. తరువాత అక్కడ నుంచి తిరిగి హెలికాప్టర్‌లో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని గన్నవరం బయలుదేరి వెళ్లారు.



కేజీహెచ్‌లో మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తడి ఆరని కన్నులు

- ప్రమాద మృతుల కుటుంబాల్లో ఒకొక్కరిదీ ఒక్కో వ్యథ
- ఒక్క జీతమూ తీసుకోలేదంటూ ఓ తల్లి ఆవేదన
- ప్రేమించి పెళ్లి చేసుకున్న నాలుగు నెలలకే భర్తను కోల్పోయిన యువతి
- ఇంటి నిర్మాణం ప్రారంభించిన మూడు నెలలకే అశువులు బాసిన కుమారుడు
- అత్యవసరంగా రావాలంటూ ఫోన్ చేయడంతో విధుల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన మరో యువకుడు

- వివరాలు మెయిన్ 11లో



కేజీహెచ్ మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబీకులు

రెండేళ్ల క్రితమే హెచ్చరించినా!

- భారీ ప్రమాదం జరిగినా జాడలేని యజమానులు
- పట్టించుకోని ఎసెన్షియా కర్మాగార యాజమాన్యం



ప్రమాదం జరిగిన ఎసెన్షియా కంపెనీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యమే కొంపముచ్చింది. కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన భారీ ప్రమాదంలో ఏకంగా 17 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కర్మాగారంలో పైపులు ఎప్పటికప్పుడు పరిక్షించి లీకులు అరికట్టాలని రెండేళ్ల క్రితం అధికారులు హెచ్చరించారు. అంతేకాకుండా కర్మాగారంలో అనేక లోపాలను గుర్తించిన అధికారులు తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని చెప్పిన ఆదేశాలు పాటించి ఉంటే బుధవారం ఘోర ప్రమాదం జరిగి ఉండేదికాదని పరిశ్రమల నిపుణులు గుర్తుచేస్తున్నారు.

రెడ్ కేటగిరీలో ఉన్న ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 2022లో భద్రతా ఆడిట్ జరిగినపుడు పలు లోపాలు గుర్తించారు. తక్షణమే లోపాలు సవరించడంతోపాటు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కర్మాగార విభాగం సంబంధిత యాజమాన్యానికి ఆదేశించింది. కర్మాగారంలో పలు విభాగాలలో సుమారు 100 అంశాలను ప్రస్తావించి దీని ప్రకారం నివారణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ అంశాలలో రెండు, మూడు అంశాలు కేవలం పైపులు లీకులకు సంబంధించివే. పీరియాడికల్‌గా పైపులు తనిఖీచేసి లీకులు ఉంటే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని స్పష్టంచేసింది. ఘోరమైన విషయం ఏమిటంటే... రియాక్టర్ నుంచి సాల్వెంట్‌ను పంపుతున్న పైపులు లీకై కింద ఫ్లోర్‌లోని ఎలక్ట్రికల్ ప్యానళ్లపై పడి ఆవిరిమేఘంగా మారి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఒత్తిడికి గురికావడం, అదే సమయంలో స్పార్క్ వచ్చి పెద్ద పేలుడు సంభవించింది. చివరకు భారీ పేలుడుకు 17మంది చనిపోయారు. పైపుల లీకులు, పీరియాడికల్‌గా తనిఖీలు చేసి ఉంటే ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేదని కొందరు అధికారులు గుర్తుచేస్తున్నారు. ఇదిలావుండగా కర్మాగారంలో భారీ ప్రమాదం జరిగినా కంపెనీ యాజమాన్యం జాడ లేకపోవం గమనార్హం. మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి పరిహారం కోసం సొమ్మును కంపెనీ ప్రతినిధి ఒకరు జిల్లా యంత్రాంగానికి అందజేశారు తప్ప యజమానులు రాలేదు.

కంపెనీ అమ్మకాల్లో సంస్థ వ్యవస్థాపక యజమాని పెంద్రి కిరణ్ రెడ్డికి తరువాత వాటాలు కొనుగోలుచేసిన దక్కన్ కెమికల్స్ యజమాన్యానికి గొడవలున్నాయి. ముఖ్యమంత్రి స్వయంగా సమీక్ష చేసి, కర్మాగారం తనిఖీచేసినా ఇద్దరు యజమానులు రాలేదు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. యజమానులకు కోట్ల లాభాలు తెచ్చిపెట్టిన ఉద్యోగులు, నిపుణుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి తప్ప యజమానులు మారలేదని ప్రమాదంలో మృతి చెందిన ఒకరి బంధువు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నైపుణ్యంతో పని లేదా?

- తక్కువ జీతానికి అనుభవం లేనివారితో పనులు
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్ట్ కార్మికులు నిద్ర లేకుండా విధులు
- విశ్రాంతి లేకపోవడంతో ప్రమాదాలు



ఎసెన్షియా కంపెనీ గేటు వద్ద గుమిగూడిన జనం

అచ్యుతాపురం, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం తక్కువ జీతానికి వస్తున్నారనే ఉద్దేశంతో నైపుణ్యం, అనుభవం లేని వారితో పనులు చేయిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక నిపుణుడి వద్ద పనిచేసిన పలువురిని తక్కువ జీతానికి తీసుకుని యంత్రాల వద్ద పనులు ... మిగతా 7వ పేజీలో

ఇక పల్లెల్లో పనుల జాతర

నేటి నుంచి గ్రామసభలు, సామాజిక వ్యక్తిగత పనులకు మోక్షం

- ఐదేళ్ల విరామం తరువాత అభివృద్ధి దిశగా అడుగులు
- కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధికి నోచుకోని రాయపురాజుపేట రోడ్డు

చోడవరం, ఆగస్టు 22:

ఐదేళ్లుగా అభివృద్ధి జాడ లేని పల్లెలకు కూటమి ప్రభుత్వ హయాంలో మహర్దశ పట్టనుంది. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టిసారించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు సక్రమంగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఐదేళ్లలో ఉపాధి నిధులతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఫలితంగా చాలా చోట్ల వైసీపీ నాయకులే సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు రైతు భరోసా కేంద్రాల పనులు చేపట్టవలసి వచ్చింది. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర డ్రైనేజీ నిర్మాణాలు, పంట కాలువల్లో పూడికలు తీయించలేకపోయింది.

అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి పంచాయతీలకు నిధులు కూడా భారీగానే విడుదల చేసింది. ఇదే సమయంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇక గ్రామాల్లో రైతులకు, స్థానికులకు ఉపయోగపడే పనులకు ప్రణాళికలు సిద్ధం చేసేందుకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలకు రంగం సిద్ధం చేసింది. గ్రామాల్లో వ్యక్తిగత అవసరాలతో పాటు, సామాజిక అవసరాలకు ఉపయోగపడే సీసీ రోడ్లు, కాలువలు, డ్రైనేజీల నిర్మాణం, చెక్ డ్యాములు, పంటకాలువలు, సామాజిక భవనాలు, పశువుల షెడ్లు, పండ్లపూల తోటల పెంపకానికి చేయూత ఇచ్చే పనులు.. ఇలా కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామసభల్లో ఆమోదించిన తీర్మానాల మేరకు పల్లెల్లో పనులకు ప్రభుత్వ అనుమతి లాంఛనప్రాయం కావడంతో గ్రామాల్లో అభివృద్ధి జోరందుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ధ్వంసమైన రోడ్లు, కాలువలు కూడా ఈ కార్యక్రమంలో మెరుగుపడే పరిస్థితి ఉండడంతో తమ ఇబ్బందులు తీరతాయని గ్రామీణులు భావిస్తున్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- జగనన్న కాలనీ, ప్రైవేటు లేఅవుట్ నుంచి గ్రావెల్, మట్టి తరలింపు
- గ్రామస్థుల సమాచారంతో రెవెన్యూ సిబ్బంది దాడులు
- ఎక్స్‌కవేటర్, రెండు డంపర్లు సీజ్



జగన్నాథపురంలో జగనన్న కాలనీ రోడ్డును తవ్వి గ్రావెల్ తరలించుకుపోయిన దృశ్యం

సబ్బవరం, ఆగస్టు 22:

మండలంలోని గొల్లలపాలెం శివారు జగన్నాథథపురంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామానికి ఆనుకొని ఉన్న జగనన్న కాలనీ, మరో ప్రైవేటు లేఅవుట్‌ను ఇష్టానుసారం ధ్వంసం చేసి గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించుకు పోతున్నారు. కాగా బుధవారం అర్ధరాత్రి తవ్వకాలు జరుపుతుండడంతో గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది దాడులు చేసి ఒక ఎక్స్‌కవేటర్, రెండు డంపర్లను సీజ్ చేశారు.

జగన్నాథథపురంలో అక్రమార్కులు బుధవారం అర్ధరాత్రి గ్రావెల్, మట్టి తవ్వకాలు ప్రారంభించారు. రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు డంపర్లతో తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. గ్రామస్థులు గమనించి స్థానిక వీఆర్వో పూడి శేషుకు సమాచారం ఇవ్వడంతో గురువారం తెల్లవారుజామున ఆయన ఇద్దరు వీఆర్‌ఏల సహాయంతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ క్రమంలో రెండు డంపర్లు, ఒక ఎక్స్‌కవేటర్ తప్పించుకుపోగా, ఒక ఎక్స్‌కవేటర్, రెండు డంపర్లను పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ గొల్లలపాలెం సర్వే నంబరు 293లో జగనన్న కాలనీకి లేఅవుట్ వేసి సెంటు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం కూడా జరిగిందన్నారు. అయితే కొందరు ఆ లేఅవుట్‌కు ఏర్పాటు చేసిన రోడ్డును తవ్వి మట్టి, గ్రావెల్ తరలించుకుపోయారని చెప్పారు. అలాగే పక్కనే సర్వే నంబరు 273లో ఒక ప్రైవేటు లేఅవుట్‌ను కూడా ధ్వంసం చేసి గ్రావెల్ తరలించుకుపోయారని చెప్పారు.

నేడు జగన్ అనకాపల్లి రాక



కొత్తూరు, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లి రానున్నారు. ఆయన ఉదయం గన్నవరం నుంచి విమానంలో 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10.20 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గంలో అనకాపల్లిలోని ఉషాప్రైమ్ ఆస్పత్రికి 11.20కి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 12.20 వరకు క్షతగాత్రులను పరామర్శించి తిరిగి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు.

జోరువాన

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. అనకాపల్లి, పాయకరావుపేట, ఎలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.



ఎలమంచిలిలో వర్షం

బాధితులకు ఓదార్పు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



ఎసెన్షియా ఫార్మా కంపెనీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీ

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరామర్శించారు. విశాఖలోని మెడికవర్ ఆస్పత్రి, కేజీహెచ్‌లను సందర్శించి బాధిత కుటుంబాలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఎసెన్షియా కంపెనీని సందర్శించి ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



ఎసెన్షియా ఫార్మా కంపెనీని సందర్శిస్తున్న చంద్రబాబు



కంపెనీ గేటు వద్ద బాధిత కుటుంబాల పడిగాపులు



హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుతో మాట్లాడుతున్న సీఎం



మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఎం



ఎసెన్షియా ఫార్మా కంపెనీ వద్ద గుమిగూడిన బాధిత కుటుంబాలు



చిన్నారులకు పరామర్శ

» కొలుకునే వరకూ వైద్య సేవలు... డిశ్చార్జ్ సమయంలో 50 వేలు సాయం

విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం కైలాస పట్నం ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చిన ఆయన.. అనంతరం ఆస్పత్రిలోని పిడియాట్రిక్ విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారుల వద్దకు వెళ్లారు. ప్రతి చిన్నారినీ పలకరించారు. వారి తల్లిదండ్రులతోనూ మాట్లాడిన సీఎం వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... 'అంద రూ కోలుకునే వరకు వైద్య సేవలు అందిస్తాం. భయపడాల్సిన పనిలేదు. అవసరమైతే ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాలని సూచించాం. పిల్లలను డిశ్చార్జ్ చేసే సమయంలో రూ.50 వేలు చొప్పున అందించి పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించాం' అని తెలిపారు. సీఎంతో పాటు ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు ఉన్నారు.





ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో సంభవించిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏడుగురికి విశాఖ వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స చేస్తుండగా వారి బంధువులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబునాయుడు గురువారం రావడంతో బంధువులను ఆస్పత్రిలోని నాలుగో అంతస్థులో ఐసీయూ పక్కన హాలులో ఉంచారు. అనకాపల్లి, విజయనగరం, విశాఖ నగరంలో పలు ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ఆస్పత్రికి చేరుకున్నారు. గాయపడి చికిత్స పొందుతున్న తమ వారిని చూసేందుకు పడిగాపులు కాశారు.

మెడికవర్‌లో క్షతగాత్రుల వివరాలు

మెడికవర్‌లో చికిత్స కోసం ఏడుగురు చేరారు. వారిలో కె.రాంబాబు(శ్రీకాకుళం జిల్లా సుభద్రాపురం), వై.మహేశ్‌బాబు(మునగపాక మండలం మారేపల్లి), పి.జగదీశ్వరరావు(విజయనగరం జిల్లా ఎల్.కోట), కలిసెట్టి చంద్రశేఖరరావు(విజయనగరం), పక్కి దేముడు(నక్కపల్లి మండలం బోయపాడు), కొండాల నారాయణరావు(శ్రీకాకుళం జిల్లా సారవకోట), భూపతి వెంకటరత్నం(రాంబిల్లి మండలం పెద్ద కల్లేపల్లి)ఉన్నారు.

కిమ్స్ ఐకాన్, ఆర్కే ఆస్పత్రుల్లో..

షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో డి.శ్రీనివాసవర్మ, జీఎస్ వరప్రసాదరాజు, పి.అరుణ్‌కుమార్, గాజువాకలో ఆర్కే ఆస్పత్రిలో జి.చైతన్య చికిత్స పొందుతున్నారు.

వెన్నెలపాలెంలో విషాదం

» ఎసెన్షియా ఉద్యోగి రామచంద్రరావు మృతితో కన్నీరుమున్నీరు



విలపిస్తున్న నాగేశ్వర రామచంద్రరావు కుటుంబ సభ్యులు

పరవాడ, ఆగస్టు 22 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియాలో జరిగిన ప్రమాదంలో వెన్నెలపాలేనికి చెందిన బొడ్డు నాగేశ్వర రామచంద్రరావు(46) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. రామచంద్రరావు గత రెండున్నరేళ్లుగా ఆ పరిశ్రమలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం జనరల్ షిఫ్టుకు వెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో భార్యతో ఫోన్‌లో మాట్లాడారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగిన ప్రమాదంలో ఆయన మృతి చెందారు. చినగంట్యాడలోని ఓ అపార్టుమెంట్‌లో కుటుంబసభ్యులతో ఉంటూ విధులకు హాజరయ్యేవారు. స్వగ్రామం వెన్నెలపాలెం అయినప్పటికీ ఉద్యోగరీత్యా అక్కడ ఉండేవారు. కాగా ఈ ప్రమాదంలో రామచంద్రరావు మృతదేహం పూర్తిగా ఛిద్రమైంది. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహానికి స్వగ్రామమైన వెన్నెలపాలెంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య కనకమహాలక్ష్మి, కుమార్తె ఆశ్రిత, కుమారుడు నిహాల్ ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

క్షతగాత్రులకు స్పీకర్ పరామర్శ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ అవినాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరిశ్రమల్లో మూడు నెలలకు ఒకసారి ఆడిట్ జరగాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సేఫ్టీ మెథడ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులున్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపీ రమేష్

వివరాల సేకరణలో అధికారులు



మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల నుంచి అసిస్టెంట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు వివరాలు సేకరించారు. పేలుడికి కర్మాగారంలోని రియాక్టర్ నుంచి కిందకు పంపింగ్ చేస్తున్న సాల్వెంట్ పైపు లీకై గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎలక్ట్రికల్ ప్యానల్స్‌పై పడడంతో గది మొత్తం ఆవిరి మేఘాలు ఏర్పడి కేబుల్ డక్ట్ నుంచి ఆ ఆవిరి గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం వ్యాపించిందని ఉద్యోగులు వివరించారు. ఆ సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో భారీ పేలుడు సంభవించిందన్నారు. ఈ దుర్ఘటనతో కొందరు ఇంకా షాక్‌లో ఉండగా, మరికొందరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం సంభవించాక ప్రభుత్వానికి పంపిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్న విధంగా గాయపడిన క్షతగాత్రులు అక్కడ జరిగిన ఘటనను వివరించారు.

క్షతగాత్రులకు పరామర్శ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి స్థానిక ఉషాప్రైమ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ గురువారం పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ఫార్మాసిటీలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్షతగాత్రులను పరామర్శించేందుకు అనకాపల్లి ఉషాప్రైమ్ ఆస్పత్రికి హాజరుకానున్నారని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఘటన జరిగితే మంత్రులు, అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఉన్నారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స

సీఎంతో లారస్ ప్రతినిధుల భేటీ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లారస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు సి.ఎన్.రావు, రామకృష్ణ చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

- అనకాపల్లి/ఆంధ్రజ్యోతి



'ఎసెన్షియా'లో కొనసాగిన సహాయక చర్యలు

రాంబిల్లి, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో బుధవారం పెనుప్రమాదం జరిగి 17 మంది మృతి చెందగా, అధిక సంఖ్యలో కార్మికులు గాయాలపాలై పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా శిథిలాల కింద ఇంకా ఎవరైనా ఉన్నారేమోననే ఉద్దేశంతో గురువారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబాలు అధిక సంఖ్యలో కర్మాగారం వద్దకు చేరుకున్నాయి. వారిలో లోనికి అనుమతించకపోవడంతో గేటు వద్ద బైఠాయించారు. కాగా కలెక్టర్‌తో పాటు పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. హోం మంత్రి అనితతో పాటు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కంపెనీ గేటు వద్ద బాధితుల పడిగాపులు

రాంబిల్లి, ఆగస్టు 22 : ఎసెన్షియా కంపెనీ గేటు వద్ద గురువారం బాధిత కుటుంబాలు పడిగాపులు కాశాయి. రాంబిల్లి మండలం సెజ్ కాలనీకి చెందిన యల్లబిల్లి చిన్నారావు ఎసెన్షియా కంపెనీలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య లోవమ్మ, కుమారుడు శశాంక్, కుమార్తె కోమలి ఉన్నారు. బుధవారం జనరల్ షిఫ్టుకు వెళ్లిన తరువాత ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని కంపెనీ వద్దకు వెళ్లి అడిగితే చిన్నారావు గురించి చెప్పలేదని ఆయన బాబాయ్ శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఆస్పత్రులు తిరిగితే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళితే కేజీహెచ్‌కి తీసుకువెళ్లిపోయారని వాపోయారు.

నైపుణ్యంతో పని లేదా?

... 5వ పేజీ తరువాయి

చేయించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో వారాల తరబడి రాత్రులు నిద్ర లేకుండా పనులు చేయిస్తున్నారని, ఒక్కొక్క కాంట్రాక్టు కార్మికుడు 12 గంటల పాటు పనిచేస్తున్నారని సమాచారం. వీరికి కాంట్రాక్టర్ భోజన, వసతి సౌకర్యాలు కల్పించి నెలకు రూ.12 వేలు జీతం ఇస్తున్నారు. వసతి కూడా రేకుల షెడ్డుల్లో ఇస్తున్నారు. వీరికి సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటు న్నారు.

సరైన ఆస్పత్రి ఏది?

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అచ్యుతాపురంలో సరైన ఆస్పత్రి లేదు. ఇక్కడ సుమారు 450కి పైగా కర్మాగారాలు ఉన్నాయి. 30 వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ సరైన అస్పత్రి లేదు. అచ్యుతాపురం, హరిపాలెంలలో పీహెచ్‌సీలు మాత్రమే ఉన్నాయి. వీటిలో సరైన మందులు, సౌకర్యాలు, సిబ్బంది లేరు. సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి కోసం గత వైసీపీ ప్రభుత్వం రెండెకరాలు స్థలం కేటాయించింది. అయితే ఐదేళ్ల పాలనతో కేవలం ప్రహరీ మాత్రమే నిర్మించింది. కూటమి ప్రభుత్వమైనా కర్మాగారాల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించే చర్యలు తీసుకోవడంతో పాటు ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.



అనకాపల్లి పట్టణంలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం



మండల కేంద్రం కోటవురట్లలో...

అంతవరకు ఎండ వాత.. అంతలోనే కుండపోత

▸▸ ఐదు మండలాల్లో భారీ వర్షంతో జనం హర్షం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 : వాతావరణంలో మార్పుల కారణంగా గురువారం జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. అనకాపల్లిలో ఉదయం పది గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. అనంతరం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడ్డారు. అలాగే ప్రధాన రహదారుల్లోని లోతట్టు ప్రాంతాల్లో కూడా నీరు నిలిచిపోయింది.

పాయకరావుపేట : మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపగా పదిగంటల సమయంలో వాతావరణంలోమార్పులు చోటుచేసుకున్నాయి. అనంతరం గంట పాటు భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆ తరువాత నుంచి సాయంత్రం వరకు చిన్నపాటి వర్షం పడి వాతావరణం పూర్తిగా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

నక్కపల్లి : గత పక్షం రోజుల నుంచి వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు తడులు లేక వరి నాట్లు కూడా ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మండలంలోని అనేక గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వేంపాడు, అమలాపురం, కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉపమాక, జానకయ్యపేట తదితర గ్రామాల్లోని రహదారులపై నీరు ప్రవహించింది. భారీ వర్షానికి సీహెచ్‌ఎల్‌పురం ప్రధాన రహదారి చెరువును తలపించింది. పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరినాట్లు, నారుమడులకు ఈ వర్షం కొంత దోహదపడుతుందని ఏవో ఉమాప్రసాద్ తెలిపారు. ఇదిలావుంటే, చినదొడ్డిగల్లులో పురాతన రెండు అంతస్తుల పెంకుటిల్లు దెబ్బతింది. వెలగా సుబ్రహ్మణ్యానికి చెందిన పురాతన మేడ వర్షానికి తడిసి పోయిపై కప్పు దెబ్బతింది. గత కొన్నాళ్ల నుంచి ఈ ఇంట్లో ఎవరూ నివాసం ఉండడం లేదు. దీంతో అది శిథిలావస్థకు చేరింది.



వర్షానికి చెరువును తలపిసస్తున్న నక్కపల్లి మండలంలోని సీహెచ్‌ఎల్‌పురం రహదారి

ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులపై ఉన్న గోతుల్లో నిరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోటవురట్ల : వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. అనంతరం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

ఎలమంచిలి : మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై సుమారు గంటపాటు కుండపోతగా పడింది. దీంతో లోట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. ఎలమంచిలిలో ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు జంక్షన్ వద్ద, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, కొత్తపేట ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయడంతో ఇటు పాదచారులు, అటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కోట్నివీధిలో ఘనంగా మరిడిమాంబ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 : పట్టణంలోని కోట్ని వీధిలో మరిడిమాంబ ఉత్సవం గురువారం అత్యంత ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట్నివీధి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, టీడీపీ నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, కోట్ని బాలాజీ, మాదంశెట్టి నీలబాబు, బత్తుల తాతయ్యబాబులు తదితరులు పూజలు జరిపారు. ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణ చంద్రరావు, తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నవ దుర్గలు, కోలాటాలు తదితర వేషధారణలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



నక్కపల్లి, ఆగస్టు 22 : ఇక్కడి చేనేత కాలనీలో ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గురువారం సంకట హర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, శేషాచార్యులు నేతృత్వంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి సద్గురువుల పాదుకా మహోత్సవం

పరవాడ, ఆగస్టు 22 : స్థానిక గౌతులచ్చన్ననగర్‌లో గల సద్గురు పాదుకా క్షేత్రంలో శుక్ర, శని, ఆదివారాల్లో సద్గురువుల పాదుకా మహోత్సవాలను నిర్వహించనున్నారు. షిరీడీ సాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరపనున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు షిరీడీ సాయినాథునికి విశేష పూజలు జరుపుతామన్నారు.

జ్యువెలరీ డిజైనింగ్‌పై అవగాహన సదస్సు

కొత్తూరు, ఆగస్టు 22 : జ్యువెలరీ డిజైనింగ్‌కు సాంకేతిక నైపుణ్యం ఎంతో అవసరమని జ్యువెలరీ డిజైనర్, వృత్తి నైపుణ్య శిక్షకురాలు జ్యోతి కొఠారి అన్నారు. అనకాపల్లిలోని గౌరీ గ్రంథాలయంలో గురువారం జ్యువెలరీ డిజైనింగ్‌పై జరిగిన మహిళా సదస్సులో మాట్లాడారు. జ్యువెలరీ డిజైన్లు సృజనాత్మకతపై ఆధారపడి ఉంటాయన్నారు.డిజైనర్ ప్రతిభ, నైపుణ్యాలను బట్టి ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, గౌరీ గ్రంథాలయం మాజీ అధ్యక్షుడు కర్రి శివ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, వృత్తి నైపుణ్య శిక్షకులు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'దేశంలో మహిళలకు రక్షణ కరువు'

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 22 : దేశంలో మహిళలకు రక్షణ కరువైందని సీఐటీయూ మండల నాయకుడు ఎస్.బ్రహ్మాజీ ఆరోపించారు. కోల్‌కతాలో జరిగిన ఘటనను నిరసిస్తూ మునగపాకలో గురువారం యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని మహిళలు పని ప్రదేశాల్లో తీవ్ర వేధింపులకు గురవుతున్నారని వాపోయారు. నాయకులు పార్వతి, వరలక్ష్మి, కుమారి, ఉమా, హేమ, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఎసెన్షియా' ప్రమాదంలో 11 మందిని రక్షించిన కాంట్రాక్టు సిబ్బంది

అచ్యుతాపురం, ఆగస్టు 22 : సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మూడో అంతస్తులో చిక్కుకుపోయిన పదకొండు మంది ఉద్యోగులను ఒక ప్రేవేటు కాంట్రాక్టు సిబ్బంది రక్షించారు. కర్మాగారంలో మూడు అంతస్తుల భవనంలో రియాక్టర్ పేలిపోయి సదరు భవనం శ్లాబ్ కూలిపోయిన విషయం తెలిసిందే. మూడో అంతస్తులో ఉన్న పదకొండు మంది సిబ్బందికి కింద ఏమి జరిగిందో తెలియదు. వీరంతా భయంతో కిందకి దిగాలని ప్రయత్నాలు చేశారు అప్పటికే విద్యుత్ సరఫరా పోయి లిఫ్ట్ పనిచేయలేదు. మెట్ల ద్వారా దిగుదామంటే రియాక్టర్ పేలుడుకి శ్లాబ్ కూలిపోయి మెట్లు కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న లారస్ ల్యాబ్‌లో సీనియర్ అధికారి గమనించి సెజ్‌లో గల వివిధ కర్మాగారాల్లో భారీ క్రేన్‌లతో నిర్మాణపు పనులు చేస్తున్న తన స్నేహితుడు సూర్య ఎలెక్ట్రమెన్ మేనేజింగ్ డైరెక్టర్ పసుమర్తి రామ్మోహన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఆయన స్పందించి రెస్పాన్స్ టీం సభ్యులు శివ, గౌరీ, ఫరూక్, రామగణేష్‌లతో బూమ్ లిఫ్ట్ ద్వారా మూడవ అంతస్తులో ఉన్న పదకొండు మందిని సురక్షితంగా కిందకు చేర్చారు.



బూమ్ లిఫ్ట్ ద్వారా ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న దృశ్యం

ఇదిలావుంటే, సెజ్‌లో గల పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము సీఎం చంద్రబాబును కోరారు. సెజ్‌లో జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించేందుకు గురువారం విచ్చేసని ముఖ్యమంత్రిని ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

'యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే సెజ్‌లోని పరిశ్రమల్లో ప్రమాదాలు'

తుమ్మపాల, ఆగస్టు 22 : అచ్యుతాపురం సెజ్‌లో గల పరిశ్రమల్లో కేవలం యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆరోపించారు. సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో చోటు చేసుకున్న సంఘటనను నిరసిస్తూ పార్టీ నాయకులతో కలిసి పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం వివరాలు సకాలంలో వెల్లడించడంలో అధికారులు, యాజమాన్యం విఫలమయ్యాయన్నారు. పరిశ్రమల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ సంఘటనకు సంబంధించి సంస్థ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజాన దొరబాబు, పి.సత్యనారాయణ, కోన లక్ష్మణ, బాబ్జి, ఫణేంద్రకుమార్, కన్నబాబు, వియ్యపురాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆందోళన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 : మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద సీపీఎం, సీఐటీయూ నాయకులు బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించే వరకు మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువెళ్లేది లేదని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు తేల్చి చెప్పారు. అలాగే ఫార్మా కంపెనీల్లో రక్షణ చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఆందోళన కొనసాగించారు. చివరకు మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ ఇచ్చిన హామీ మేరకు ఆందోళనకారులు శాంతించారు. దీంతో మృతదేహాలను వారి స్వగ్రామాలకు తీసుకు వెళ్లారని అనకాపల్లి డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'నిర్వాసిత యువతకు ఉపాధే లక్ష్యం'

పరవాడ, ఆగస్టు 22 : నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. సింహాద్రి సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నాల్గో బ్యాచ్ స్కిల్ డెవలప్‌మెంట్ విజయోత్సవ కార్యక్రమం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా నిర్వాసిత యువత ఉపాధికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ విభాగాల జీఎంలు ఆర్ఆర్ ఫరిదా, ఎన్.గడ్డం, పద్మప్రియా, సీమంత మహాపాత్ర, సీఎస్ఆర్ అధికారులు కె.ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్, డాక్టర్ సీహెచ్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం, ఆగస్టు 22 : జీవీఎంసీ ఏడో జోన్ అనకాపల్లి పరిధిలో శనివారం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు శేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవీఎంసీ అమృత్ ప్రాజెక్టు 2.0లో భాగంగా పీఎస్‌సీ పైపులైన్ల స్థానంలో 500 ఎంఎం సైజు గల డీఐ పైపులైన్లుకు అనుసంధానం చేయనున్నామన్నారు. ఈమేరకు శనివారం అనకాపల్లి (తుమ్మపాల) హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ప్రస్తుతం ఉన్న పీఎస్‌సీ పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో 'సెయింట్ జాన్స్'కు పతకాల పంట

కశింకోట, ఆగస్టు 22 : ఇక్కడి సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాల పంట పండించారు. యూనిక్ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎనిమిదో ఇంటర్ యూనిక్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు బంగారు, ఎనిమిది మంది విద్యార్థులు వెండి, ఆరుగురు విద్యార్థులు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు. వీరితో పాటు కోచ్ కె.రవికుమార్‌ను స్కూల్ అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, అధ్యాపక బృందం అభినందించారు.



స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

మానవత స్వచ్ఛంద సంస్థ శాంతి ర్యాలీ

పాయకరావుపేట, ఆగస్టు 22 : రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెది రెడ్డి చిట్టిబాబు, గ్రామ పెద్దలు ధనిశెట్టి బాబూరావు, గొర్రెల రాజబాబు, యాళ్ళ వరహాలబాబు, పెదిరెడ్డి శ్రీను, జగతా శ్రీనివాస్, మజ్జూరి నారాయణరావు, వెలుగుల అర్జునరావు, మామిడి వెంకటేశ్వరరావు, పెదిరెడ్డి ప్రసాద్, మొల్లేటి నారాయణమూర్తి, పెదపూడి నరసింహమూర్తి, గొలపల్లి నాగు పాల్గొన్నారు.

గాయత్రీ యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన

సబ్బవరం, ఆగస్టు 22 : బాటజంగాలపాలెంలో గల దయానంద్ వేదిక్ స్కూల్ వేద గురుకుల ప్రాంగణంలో గురువారం గాయత్రీ యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. వైదిక పురోహితులు రాయపురెడ్డి కృష్ణారావు, వేద ధర్మ ప్రచారకులు తిరుమల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొవ్వ గాయత్రీ, ప్రసాదరావు, బొత్స అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



అనకాపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22 : సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలో సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరమేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. పదిహేను మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీలా మోహన్, శ్రీనివాస్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో హీరో చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నక్కపల్లిలో అభిమానులు కేక్ కట్‌చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గర్ల్స్ హైస్కూల్‌లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.అభిమానులు మీగడ సత్తిబాబు, లంక శ్రీనివాసరావు, కొల్నాటి దుర్గా ప్రసాద్, కోసూరి శ్రీను, నాగు, దేవవరపు లోవరాజు, త్రినాథరావు, పెదిరెడ్డి రమేశ్, నానాజీ, కామేశ్వరరావు, అల్లాడ రాము, వెంకట సత్తియ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో డీఏపీ కొరత

నాతవరం, ఆగస్టు 22 : నాతవరం మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో డీఏపీ ఎరువు కొరత ఉండటం తో వరిసాగు చేసే రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే తాండవ నీరు విడుదల చేయడంతో నాతవరం మండలంలో ముమ్మరంగా దమ్ములు చేస్తున్నా రు. ఈ సమయంలో రైతులు వరినాట్లు వేసే సమయం లో డీఏపీ ఎరువు వేస్తారు. అయితే రైతుభరోసా కేంద్రాల్లో డీఏపీ అందుబాటులో లేకపోవడంతో పక్క మండలాలకు వెళ్ళి ఎలాగో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో పొటాష్, యూరియా మాత్రమే లభ్యమవుతోందని, ఈ ఎరువుల అవసరం ప్రస్తుతానికి లేదని రైతులు అంటున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి నాతవరం మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో డీఏపీ ఎరువును అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నర్సీపట్నం, ఆగస్టు 22 : డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభించినట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లుతో వచ్చి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ బోటనీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీఏ హిస్టరీ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 24లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం


తుప్పల మధ్య నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

మాకవరపాలెం, ఆగస్టు 22 : మండలంలోని పైడిపాలలో ఉన్న చెత్త సంపద కేంద్రం వృథాగా పడి ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.4 లక్షలతో చేపట్టిన ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ సంపద కేంద్రాన్ని నేటి వరకూ అందుబాటులోకి తీసుకురాలేదు. నిర్వహణను గాలికొదిలేశారు.

దీంతో ఈ కేంద్రం పరిసరాల్లో దట్టంగా తుప్పలు పెరిగిపోయాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారులా! పశువుల ఆవాసాలా!!

▸▸ మెయిన్ రోడ్డులో గుంపులుగా సంచారం


ప్రధాన రహదారిపై యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు

నర్సీపట్నం, ఆగస్టు 22 : పట్టణంలోని రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తూ వాహనదారులు, పాదచారులు, చిరు వ్యాపారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రధాన రహదారిలో వీటి తాకిడి అధికంగా ఉంది. పశువులను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు కొన్నిసార్లు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మంగళవారం ఎన్టీఆర్ మినీ స్టేడియం ఎదురుగా పశువులు రోడ్డుకి అడ్డంగా ఉండటంతో వాటిని తప్పించే యత్నంలో ఇద్దరు యువకులు బైక్‌తో సహా పడిపోయారు. ప్రతీ రోజు ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పదుల సంఖ్యలో పశువులు, దూడలు రోడ్డు మధ్యలో పడుకుంటున్నాయి. డివైడర్ మీద ఏర్పాటు చేసిన మొక్కల పచ్చదనాన్ని పాడు చేస్తుంటాయి. పశువుల పెంపకందారులు పశువులకు మేత వేయకుండా విచ్చలవిడిగా రోడ్డు మీద వదిలేస్తున్నారు. దీంతో పశువులు రోడ్డుపై దుకాణాలు, కూరగాయలు, పండ్లు వ్యర్థాలు తిని రోడ్డే ఆవాసాలుగా చేసుకుంటున్నాయి. ఈ విషయంలో అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా రోడ్లపై తిరిగే పశువుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మాకవరపాలెం బస్టాండ్ ప్రాంగణం

మాకవరపాలెం, ఆగస్టు 22 : మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ చిన్నపాటి వర్షానికే వరదమయంగా తయారవుతోంది. మాకవరపాలెం మెయిన్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ బస్టాండ్‌లోఅనేక సమస్యలు నెలకొని ఉన్నాయి. విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళా ప్రయాణికులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో బస్సులు ఎక్కేటప్పుడు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బురదనీటిలో నుంచి బస్సు ఎక్కాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బురదమయంగా ఉన్న బస్టాండ్

బస్టాండ్‌లో చెత్తాచెదారం

ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికుల అసంతృప్తి


ప్రయాణికులు కుర్చోనే బెంచీలు వద్ద చెత్తచెదారం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 22 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం(కృష్ణాదేవిపేట) ఆర్టీసీబస్‌స్టేషన్‌లో రోజులు తరబడి చెత్త సేకరణ చేయకపోవటంతో ప్రాంగణమంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ చెత్తచెదారాల మధ్యే బెంచీలపై కూర్చొని బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ కూడా అధికారులు గాలికొదిలేశారు. దీంతో బస్‌స్టేషన్ ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నది. గతంలో ఇక్కడ పని చేసిన కార్మికులకు ఆర్టీసీ అధికారులు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవటంతో వారు పని మానేశారు. అనంతరం నర్సీపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో పని చేసే పారిశుధ్య కార్మికులను రోజుకు ఒకరు చొప్పున ఇక్కడ పారిశుధ్య పనులు చేయించేవారు. గత పది రోజులుగా పూర్తిగా పట్టించుకోకపోవడంతో బస్‌స్టేషన్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. దీంతో గిరిజన, మైదాన ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయానికులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ

నర్సీపట్నం, ఆగస్టు 22 : ఎరువుల దుకాణాలు, గోదాములపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం యూరియా బస్తా నిర్దేశించిన ధర కంటే అధిక ధరకు విక్రయిస్తున్న ఊడా బంగార్రాజు ఎరువుల దుకాణంపై ఇన్‌స్పెక్టర్ అనురాధ కేసు నమోదు చేశారు. యూరియా బస్తా రాయితీ పోను రూ.266లకు అమ్మాల్సిన ఉండగా రూ.330లకు అమ్ముతున్నట్టు గుర్తించారు. పాస్ఫేట్ బస్తా ఉండాల్సిన నికర బరువు కంటే తక్కువ ఉండటంతో కేసు రాశారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బస్తా మీద రేటు చూసి కొనుగోలు చేయాలని, తూకం వేసి సరి చూసుకోవాలని ఆమె సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

గొలుగొండ, ఆగస్టు 22 : సీజనల్ వ్యాధుల నియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రతపై రూరల్ వాటర్ శానిటేషన్ జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు భోజనం ముందు తరువాత చేతులు శుభ్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేజేఎం జిల్లా కో-ఆర్డినేటర్ పి.పుల్లయ్య, ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా సురేంద్ర



నర్సీపట్నం, ఆగస్టు 22 : జీవీఎంసీ ఏవోగా విధులు నిర్వహిస్తున్న జంపా సురేంద్రను నర్సీపట్నం పురపాలక సంఘం కమిషనర్‌గా నియమిస్తూ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పూడి రవిబాబును మునిసిపల్ పరిపాలనా విభాగం డైరెక్టర్‌కి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కాగా, 2016 నుంచి 2019 వరకు ఇక్కడ కమిషనర్‌గా సురేంద్ర పని చేశారు.

చెత్తకుప్పలు తొలగింపు



చెత్తకుప్పల తరలింపు చేపడుతున్న దృశ్యం

గొలుగొండ, ఆగస్టు 22 : మండలంలోని చీడిగుమ్మలలో శివాలయం వద్ద, దళిత కాలనీల్లో పేరుకుపోయిన చెత్తకుప్పల తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. చీడిగుమ్మలలోని శివాలయం వద్ద రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోవడంతో వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో స్పందించిన పంచాయతీ అధికారులు చెత్తను సంపద కేంద్రానికి తరలించారు. అలాగే దళిత కాలనీలో నివాస గృహాల మధ్య పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు.


మాడుగులలో కుక్కల బెడద

మాడుగుల రూరల్, ఆగస్టు 22 : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులుగా సంచరిస్తూ రోడ్లు, వీధుల్లో తిష్ట వేస్తున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెంటబడి పరుగులు తీయిస్తున్నాయి. దీంతో భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కల నియంత్రణపై అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వివిధ ప్రాంతాల్లో కుక్కల దాడిలో చిన్నారులు గాయాలు పాలవుతున్న సంఘటనలు ఉంటున్నాయి. గుంపులుగా ఉన్న కుక్కలను చూసి పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో పగలూరాత్రి తేడాలేకుండా కుక్కలు స్వైరవిహారం చేస్తుంటాయి. ఇక్కడ మాంసం దుకాణాలు, హోటళ్లు ఎక్కువగా ఉండడంతో పారేసిన వ్యర్థాలు, మాంసం ముక్కల కోసం కుక్కలు కొట్లాడుకుంటూ నానాహంగామా సృష్టిస్తుంటాయి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాము కాటుకు గురైన పశు వైద్యాధికారిణి

▸▸ మెరుగైన వైద్యానికి విశాఖ తరలింపు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 22: వడ్డాది పశువైద్యశాల కేంద్రం అధికారిణి డాక్టర్ వాసవి గురువారం పాముకాటుకు గురయ్యారు. ఆమెను పాము కాటేయడంతో సిబ్బంది హుటాహుటిన చికిత్సల నిమిత్తం చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించారు.



సమస్యలు పరిష్కరించండి

▸▸ బుచ్చెయ్యపేట మండల సమావేశంలో అధికారులను కోరిన సభ్యులు


సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ నాగేశ్వరిదేవి, అధికారులు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 22 : మండలంలోని వివిధ సమస్యలపై సభ్యులు సంబంధిత అధికారులను నిలదీశారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన గురువారం బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా సభ్యులు సమస్యలపై ఏకరవు పెట్టారు. వరి ఆకుపోతల సమయంలో ఏర్పడిన విత్తనాల కొరతపై పలువురు ఏవో భాస్కరరావును నిలదీశారు. వరినాట్లు జరుగుతున్నందున సకాలంలో రసాయనిక ఎరువులు, మందుల సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌జీఎల్ రకం వరిసాగు మన ప్రాంతానికే పరిమితం కావడం వలన ఆ రకం విత్తనాల కొరత ఏర్పడిందని ఏవో వివరించారు. సమస్య పరిష్కారానికి గ్రామాన్ని ఒక బ్లాక్‌గా ఎంపిక చేసి విత్తనోత్పత్తికి తగిన చర్యలు చేపట్టామన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో 22వేల హెక్టార్ల వరినాట్లకు గాను 1200 హెక్టార్లలో మాత్రమే నాట్లు జరిగినట్టు చెప్పారు. జల్ జీవన్ మిషన్‌లో పనులు నిలిపివేతపై విజయరామరాజుపేట, దిబ్బిడి, పొలేపల్లి సర్పంచ్‌లు విజయకుమార్, మాణిక్యం, పైడినాయుడు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హరీష్‌ను నిలదీశారు. బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా నిలిచిన పనులు వచ్చే నెల ప్రారంభం కానున్నాయని ఏఈఈ తెలిపారు. వర్షా కాలం కావడంతో జ్వరాల అదుపునకు చేపట్టిన చర్యలను వడ్డాది, బుచ్చెయ్యపేట, తురకలపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు శంకుతల, వెంకట సాయి, సంధ్యారాణిలు వివరించారు. తురకలపూడి పరిధి చింతపాకలో నిర్మించిన ఉప ఆరోగ్య కేం ద్రం భవనానికి నిర్మాణదారుడు తాళాలు వేయడంతో వైద్య సేవలు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నామని డాక్టర్ సంధ్యారాణి సమావేశం దృష్టికి తీసుకొచ్చి, భవనాన్ని అందుబాటులోనికి తీసుకురావాలని ఎంపీడీవో సువర్ణరాజును కోరారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయ ఏఈఈ ప్రభును ఎంపీడీవో వివరణ కోరగా, పూర్తిస్థాయిలో బిల్లుచేశామని, అకౌంట్‌లో అమౌంట్ పడకపోవడంతో సదరు భవనానికి తాళాలు వేశారన్నారు. తాళాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఏఈఈ ప్రభును ఎంపీడీవో ఆదేశించారు. శుక్రవారం నిర్వహించనున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మురళీ సభ్యులను కోరారు. గ్రామ సభలు ఆమోదించిన పనులనే ఉపాధి పథకంలో చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్, రెవెన్యూ, విద్య, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల పనితీరును ఆయా అధికారులు సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీవో బొంజుబాబు, విద్యుత్ ఏఈఈ రాజు, మండల పరిషత్ కార్యాలయ ఏఈ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోనాం సంతలో సీతాఫలానికి గిట్టుబాటు ధర కరువు

▸▸ యాభై కాయలు ఉన్న బుట్ట కేవలం రూ.350 నుంచి రూ.400లకు విక్రయాలు

▸▸ కష్టానికి తగిన ఫలితం దక్కలేదని గిరిజన రైతులు ఆవేదన


సీతాఫలాలను సంతలో విక్రయానికి తెచ్చిన దృశ్యం

చీడికాడ, ఆగస్టు 22 : మండలంలోని కోనాం సంతలో సీతాఫలాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజన రైతులు నిరాశకు గురయ్యారు. గురువారం జరిగిన సంతకు ఏజెన్సీలోని వివిధ గ్రామాల నుంచి రైతులు తట్టలు, కావిళ్ల ద్వారా సీతాఫలాలను మోసుకు వచ్చారు. అయితే ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండడంతో మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు అంతగా సంతకు రాలేదు. దీంతో సుమారు యాభై కాయలు ఉన్న తట్ట కేవలం రూ.350 నుంచి రూ.400లు మాత్రమే ధర పలికింది. కొందరు రైతులు సరైన ధర వస్తుందని మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచి చూశారు. అయినా ఫలితం లేకపోవడంతో అదే ధరకు అమ్మలు చేపట్టారు. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో పండు ధర ఇరవై రూపాయలు ఉండగా, సంతలో తక్కువకు అమ్మడు కావడంతో వారంతా డీలా పడ్డారు. అనంతరం ఈ పండ్ల అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులతో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి ఇంటిముఖం పట్టారు.

13 అడుగుల గిరినాగు పట్టివేత


వీరభద్రునిపేటలో గిరినాగును పట్టుకొంటున్న దృశ్యం

చీడికాడ, ఆగస్టు 22: మండలంలోని వీరభద్రునిపేట గ్రామంలో గిరినాగు హల్‌చల్ చేయడంతో రైతులు బెంబేలెత్తిపోయారు. స్థానిక కల్యాణ మండపాన్ని ఫంక్షన్ కోసం చుట్టూ ఉన్న తుప్పలను కొడుతుండగా 13 అడుగుల గిరినాగు రైతులకు కనిపించింది. భయంతో వారు పరుగులు తీశారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో స్నేక్ క్యాచర్ వెంకటేశ్‌తో పాటు మరో ఇద్దరు కష్టపడి దాన్ని బంధించారు. రిజర్వు ఫారెస్టులో వదిలివేస్తామని తెలిపారు.

'నాలుగేళ్ల డిగ్రీతో ఎంతో ఉపయోగం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం, ఆగస్టు 22 : నాలుగేళ్ల డిగ్రీ కోర్సుతో విద్యార్థులకు ఉపయోగాలు ఎన్నో ఉన్నాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షా ఆరంభ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఈపీ 2020 జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ఆసక్తి ఉన్న విద్యార్థులు చదువుకోవచ్చునన్నారు. నాలుగేళ్ల డిగ్రీ తరువాత పీజీకి, పీహెచ్‌డీకి కూడా అర్హత కలిగి ఉంటారన్నారు. నాలుగేళ్ల డిగ్రీ ఆసక్తి లేని విద్యార్థులు మూడేళ్ల తరువాత డిగ్రీ విరమించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, మాల్యాద్రి, బి.బిచ్చమ్మ, సత్యవతి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు వితరణ


దాతలు అందించిన వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

రోలుగుంట, ఆగస్టు 22 : జగ్గంపేట ఎంపీపీ పాఠశాలకు స్థానిక నాయకులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కలిసి గురువారం ఐదు వేల రూపాయలు విలువ చేసే స్టీల్ వాటర్ బాటిళ్లను వితరణగా అందజేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వేడి నీటిని తాగేందుకు విద్యార్థులకు వీటిని సమకూర్చినట్టు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం కాళింగ సతీష్, జె.నాయుడుపాలెం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రమేష్‌కుమార్, స్థానిక నాయకులు బోడాపాత్రుని నరేష్, శివాజీ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సభలు

కె.కోటపాడు, ఆగస్టు 22 : గ్రామ సభలను శుక్రవారం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఏక కాలంలో జరుగుతాయని, ప్రజలు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ఆయా సభల్లో తెలియజేయాల్సిందిగా కోరారు. 33 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులతో పాటు మరో 20 మంది సూపర్‌వైజర్లు, వివిధ శాఖల అధికారులు సభలో పాల్గొంటారన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

చోడవరం, ఆగస్టు 22 : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ప్రేమ సమాజంలో పేదలకు, విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కేక్‌కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. అభిమానులు ఆకుల వాసు, మజ్జి వెంకట్, బేరా కొండలరావు, గంగులకుర్తి ప్రసాద్, గణేష్, రాజు, శ్రీను, గణేష్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో మోస్తరు వర్షం

మాడుగుల రూరల్/ దేవరాపల్లి, ఆగస్టు 22 : వాతావరణంలో మార్పుల కారణంగా మాడుగుల, దేవరాపల్లి మండలాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండలు మండిపోతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు తాజాగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం వరినాట్లకు, సరుగుడుకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.



సత్యవరంలో పశు వైద్య శిబిరం

▸▸ పర్యవేక్షించిన పశు సంవర్ధక శాఖ ఏడీ


పశువులకు వైద్య సేవలను పరిశీలిస్తున్న పాడేరు డివిజన్ ఏడీ నరసింహులు

మాడుగుల రూరల్, ఆగస్టు 22 : సత్యవరం గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పశువులకు గర్భకోశ వ్యాధి తనిఖీలు, కొన్నింటికి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడంతో పాటు దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్టు ఎం.కోడూరు పశు వైద్యశాల వైద్యులు డాక్టర్ అరుణ కిరణ్ తెలిపారు. ఈ శిబిరాన్ని పాడేరు డివిజన్ ఉప సంచాలకులు సీహెచ్.నరసింహులు, మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు పరిశీలించారు. అనంతరం 20 మంది పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అప్పారావు, పశు వైద్యులు గాయత్రి, మణి లక్ష్మణ్, స్థానిక నాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట, ఆగస్టు 22 : మండల కేంద్రం రోలుగుంట, సుబ్బారాయుడుపాలెం ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం రోలుగుంట, కొవ్వూరు సన్ ఫుడ్ కార్పొరేషన్ బిట్ లైన్, ఓలం ఫ్యాక్టరీ లైన్, స్టోన్ క్రషర్ల లెన్‌లతో పాటు కుసర్లపూడి, రొంగలిపాలెం, జేపీ అగ్రహారం, జానకిరాంపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ రామకృష్ణారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరాపల్లి మండలంలో....

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను మరింత మెరుగు పర్చేందుకు చేపట్టనున్న చర్యల్లో భాగంగా శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. ఇందులో భాగంగా పెదనందిపల్లి, చిననందిపల్లి, నాగయ్యపేట, సీతంపేట, కాశీపురం, తామరబ్బ, చింతలపూడి, రైవాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

చీడికాడ మండలంలో..

చీడికాడ : మండలంలోని మూడు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఆ శాఖ ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. విద్యుత్ లైన్‌లను తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు చీడికాడ, జైతవరం, బైలపూడి గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నామని వివరించారు.